# పాపం వెంకటేశం

జీడిగుంట పద్మప్రియ

ఆఫీస్ నుండి ఇంటికి ఎంతో అలసటగా నలిగిన ముఖంతో వచ్చిన వెంకటేశానికి, అతడి భార్య సీత ఉత్తరం అందించి లోనికి వెళ్ళిపోయింది. వెంకటేశం జేబులోంచి "రుమాలు" తీసుకొని, ముఖం తుడుచుకుని ఫూష్! అనుకుంటూ వాలు కుర్చీలో కూలబడి, లెటర్ విప్పాడు.

చి|| వెంకటేశానికి,

మీ పెద్దమ్మ ఆశీర్వదించి వ్రాయునది,

నీ పెళ్ళయ్యాకా నేను నిన్నూ, నీ భార్యనూ చూడలేదు. కనుక మా అబ్బాయి రామాన్ని వెంట పెట్టుకుని వస్తున్నాను. మంగళవారం సాయంత్రం మెయిల్ కి వస్తున్నాను. స్టేషన్ కి రావలెను.

ఇట్లు, మీ పెద్దమ్మ.

ఆ ఉత్తరం చదవగానే, వెంకటేశం నెత్తిన పెద్దబాంబు పడ్డట్టయింది. అసలే యివి నెలాఖరు రోజులు యింకా జీతాలు యిరవయి రోజులదాకా రావు. ఈసమయంలో ఆవిడగారూ, ఆవిడ కొడుకూ ఊడి పడుతున్నారు. భగవాన్ ఎటువంటి పరిస్థితులు కల్పించావు? అనుకుని, సీతా! సీతా! అంటూ భార్యను కేకవేశాడు గట్టిగా.

ఆ వస్తున్నాను. అంటూ సీత ఇత్తడి గ్లాసుతో, మడ్డిలాంటి కాఫీ తెచ్చి యిచ్చింది.

ఈ ఉత్తరం చదివావా నువ్వు!" అన్నాడు వెంకటేశం.

ఆ! మీ పెద్దమ్మగారు వస్తారటగా? అన్నది సీత.

అవును. యిలాంటి పీడలన్నీ మనకే చుట్టుకుంటాయి అని విసుక్కొని, కాఫీ గ్లాసు కాళీచేసి క్రిందపెట్టాడు వెంకటేశం.

మంగళవారం యింకా ఎన్నిరోజులుంది? మళ్ళీ ప్రశ్నించాడు వెంకటేశం.

అయిదు రోజులుంది. అన్నది సీత.

చూడు సీతా ఇవినాకు నెలాఖరు రోజులు కదా! ఫస్టు తారీకుకు కూడా జీతాలు రావు నాకు. కనీసం ఇరవయిరోజులు పడుతుంది జీతాలు రావటానికి. మూడువందల జీతంలో మనిద్దరము, ఒక పిల్లాడూ నెట్టుకోలేక పోతుంటే, మధ్య వాళ్ళొస్తే ఎలా పెడతాం వాళ్ళకు? అసలే మా పెద్దమ్మకు నామీద చాలా ప్రేమ. వచ్చిందంటే, ఒక నెలరోజుల దాకా కదలదు. ఈ నెలరోజులు వాళ్ళిద్దరికీ ఎలా పెడతాం? కనుక వాళ్ళను రానివ్వకుండా చెయ్యటానికి ఏదైనా ఉపాయం ఆలోచించు అంటూ ముగించాడు వెంకటేశం.

సీత నిష్ఠూరంగా, బాగుంది! వాళ్ళు వస్తున్నప్పుడు రావద్దని ఎలా అంటాం! ఏం బాగుంటుంది!" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

వెంకటేశానికి సీతమీద పళ్ళు మండి

పోయింది పక్కక్రిందనుంచి లేచి యిటూ, అటూ పచార్లు చేశాడు.

అతడి ఆలోచనల్లా ఒక్కటే !

వాళ్ళ పెద్దమ్మను రానివ్వకుండా చెయ్యాలి ! ఎలా ? ఎలా ? అనుకుంటూ తీవ్రంగా ఆలోచిస్తూ ఇటూ, అటూ తిరిగాడు హఠాత్తుగా మెరుపులా ఒక ఆలోచన తట్టింది వెంకటేశానికి.

అతడి మొహం ఆనందంతో దీప్తిప్రపంత మయ్యింది. వెంటనే గబగబా పుస్తకాల బీరువా అంతా గాలించి, ఒక కార్డు సంపాదించి దానిమీద ఇలా రాశాడు

" పెద్దమ్మకు,

వెంకటేశం నమస్కరించి వ్రాయున్నది —

నువ్వు మంగళవారంనాడు యిక్కడకు వస్తానని వ్రాశావు. నన్ను క్షమించు పెద్దమ్మా ! మా ఫ్రెండు ఒకడు తన ఫ్యామిలీతో సహా ఊటీ వెళుతున్నాడు. మా ఫ్యామిలీని కూడా రమ్మన్నాడు. మేము సామానంతా సర్దుకుని ప్రయాణ మవుతుండగా. నీ ఉత్తరం అందింది. ప్రయాణం మానేద్దా మనుకున్నాను. కాని, అప్పటికే టికెట్లు రిజర్వేషన్ చేయించేసాము కనుక ఇప్పుడు నువ్వు రావద్దని సవినయంగా మనవి చేసుకుంటున్నాను. మేము ఊటీనుంచి నెల రోజులదాకా రాము ఆ తర్వాత నేను ఉత్తరం వ్రాస్తాను. అప్పుడు వద్దువుగాని.

క్షమించమని అర్థిస్తూ,
వెంకటేశం.

ఇలా వ్రాసిన వెంకటేశం తన సమయస్ఫూర్తికి తనే మురిసిపోయి ఆ కార్డు తీసుకుపోయి సీతకు చూపించి, చూశావా నా తెలివి ? అన్నాడు అది చదివిన, సీత బుగ్గలు నొక్కుకుంటూ, అయ్యో రామా ! ఎందుకండీ అబద్ధాలు ? కలో, గంజో మనతో పాటే వాళ్ళకూ పొయ్యాలి కానీ — ఇన్ని అడ్డదారులెందుకు ? అన్నది.

నోర్ముయ్ ! అసలే ఆవిడ వస్తోందని నేను బెంగపెట్టుకుని ఛస్తూ ఏదో ఉపాయం ఆలోచించి, అపాయం తప్పించుకోవాలని చూస్తూంటే మధ్య నీగొడవేమిటి ? వంద అబద్ధాలాడి ఒక పెళ్ళి చెయ్యమన్నారు. నేను ఒక అబద్ధం ఆడి పెద్ద ఆపద తప్పించుకుంటున్నాను అని వెంకటేశం సీతను కసిరి, వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు వెంకటేశం ఆ కార్డు పోస్టులో వేసి వచ్చి, హమ్మయ్య ! అని తేలిగ్గా నిట్టూర్చాడు.

* * *

మంగళవారం వచ్చింది, వెళ్ళిపోయింది కూడా. తన పెద్దమ్మ రానందుకు సంతోషించాడు వెంకటేశం. అలా ఒక నెల గడిచింది.

వెంకటేశానికి ఇంకా జీతాలు రాలేదు.

ఆరోజు ఎంతో నీరసంగా, ఇంకా జీతాలు రాలేదనే బెంగతో, ఇంటికి వచ్చిన వెంకటేశం, టేబుల్ మీద ఉన్న కవరుచూసి విప్పాడు.

అది వెంకటేశం పెద్దమ్మ వ్రాసింది.

చి॥ వెంకటేశానికి,

నువ్వు ఈ పాటికి ఊటీనుంచి వచ్చే ఉంటావని తలుస్తాను, మొదట నేను అక్కడకు వచ్చి నీచేతిలో ఒక అయిదు వందలు పెడదామనుకున్నాను కానుకగా. కానీ నువ్వు ఊటీవెళ్తున్నట్లు వ్రాశావు. అంత ఊటీ వెళ్ళటానికే డబ్బున్న వాడికి నా బోడి అయిదు వందలు ఆనుతుందా ?" అనివూరుకుంటున్నాను.

ఇట్లు
మీ పెద్దమ్మ

అది చదివిన వెంకటేశం, అయ్యో ! వెధవ అబద్ధం ఆడి అయిదువందలు పోగొట్టుకున్నానే. అనివాపోయాడు. ★